సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
గురువారం ׀ 20 ׀ జూలై ׀ 2023



పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. - 8లో



లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.అన్నపూర్ణ తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
33.9 /25.2

వాతావరణం

జిల్లాలో బుధవారం 25.2 - 33.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 8.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

చిరు సేద్యం.. ఆరోగ్య భాగ్యం

- జిల్లాలో ఈ ఏడాది 8 వేల హెక్టార్ల చిరుధాన్యాల సాగుకు ప్రణాళికలు
- జిల్లావ్యాప్తంగా అవగాహన సదస్సుల నిర్వహణ
- జొన్న, రాగులకు మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వం
- పౌరసరఫరాలశాఖ ద్వారా కొనుగోలుకు సన్నాహాలు



కడప అగ్రికల్చర్: మారుతున్న ఆధునిక పోకడలు.. నిత్యం పని ఒత్తిడిలో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయడం.. తీరిక లేకుండా బిజీగా గడుపుతూ దొరికిన జంక్‌ఫుడ్ తినడానికి జనం అలవాటు పడిపోతున్నారు. దీంతో కొన్ని అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోగ్యానికి అవసరమయ్యే పోషకాలు ఉన్న తిండి తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. చిరుధాన్యాల్లో మంచి పోషక విలువలు ఉంటున్నాయి. వీటిని సాగు చేస్తున్న రైతులకు సైతం సిరులు కురిపిస్తున్నాయి. అంతే కాకుండా వీటి సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మద్దతు ధరను కూడా ప్రకటించింది. రైతులు పండించిన దిగుబడులను పౌరసరఫరాలశాఖ ద్వారా కొనుగోలు చేసేందుకు సన్నాహాలు చేసింది. దీంతో చాలా మంది రైతులు చిరుధాన్యాల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

అధిక దిగుబడులే లక్ష్యం

నేటి పోటీ ప్రపంచంలో అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం పెరిగిపోయింది. ఫలితంగా భూమిలో రసాయన అవశేషాలు నిండి ఏటికేడాది పంట దిగుబడులు పడిపోతున్నాయి. ఇలా సాగు చేసిన ఆహార పంటల్లో కూడా రసాయనాల అవశేషాలు ఎక్కువ ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఫలితంగా జనాల్లో వ్యాధుల సంఖ్య ఎక్కువ అవుతున్నట్లు తెలుస్తోంది. వీటికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. చాలా మంది ఇప్పుడు చిరుధాన్యాలను ఇష్టపడుతున్నారు. ఇందుకు సంబంధించి ఇటీవలే ఐక్య రాజ్య సమితి కూడా 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సాగును ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో సదస్సులను నిర్వహిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తోంది.

- చిరుధాన్యాలు ఒకప్పుడు పేదలు, మధ్య తరగతి ప్రజల ప్రధాన ఆహారం. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం వరకు వీటి వినియోగం అధికంగానే ఉండేది. వీటిని రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా పశువుల ఎరువు, చెరువు మట్టి,సేంద్రియ ఎరువులతో పండించేవాళ్లు. ఫలితంగా వీటిని వాడే ప్రజల్లో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉండేది. అనంతరం వచ్చిన మార్పులతో ఏడాదికేడాది చిరుధాన్యాల సాగు తగ్గుతూ వచ్చింది. చాలా మంది రైతన్నలు అధిక ఆదాయం కోసం వరి, పత్తి, మిరప, ఉల్లి వంటి పంటల సాగుపై ఆసక్తిని కనబరచడం వల్ల చిరుధాన్యాల సాగు కనుమరుగవుతూ వచ్చింది. వీటితోపాటు అధిక దిగుబడులను సాధించాలనే పోటీతత్వంతో రైతులు విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడటం మొదలు పెట్టారు. ఫలితంగా సాగు ఖర్చులు పెరిగి పంట దిగుబడులు తగ్గాయి. భూమి కూడా విషతుల్యంగా మారుతోంది. దీనిని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా జొన్నలు, రాగి పంటలకు మద్దతు ధరను ప్రకటించింది.

జిల్లాలో ఖరీఫ్‌లో మిల్లెట్స్ సాధారణ సాగు వివరాలు

పంట	లక్ష్యం	సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)
మొక్కజొన్న	574	256.8
కొర్ర	936	07
సజ్జలు	1025	78
జొన్నలు	1331	18.4

ఖరీఫ్‌లో ప్రత్యేకంగా మిల్లెట్స్ సాగు లక్ష్యం ..

పంట	సాగు లక్ష్యం (హెక్టార్లలో)
జొన్నలు	2664
సజ్జలు	2050
రాగి	1800
కొర్ర	1872



మిల్లెట్స్‌కు సంబంధించిన చిరుధాన్యాలు

ఈ ఏడాది 8386 వేల హెక్టార్లు సాగు లక్ష్యంగా..

జిల్లాలో మిల్లెట్స్ సాగును ప్రోత్సహించే లక్ష్యంలో భాగంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 8386 హెక్టార్లలో సాగు చేసేందుకు వ్యవసాయ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇందులో 2664 హెకార్టలో జొన్న, 2050 హెక్టార్లలో సజ్జలు, 1800 హెక్టార్లలో రాగి, 1872 హెక్టార్లలో కొర్రలు సాగు లక్ష్యంగా నిర్దేశించారు. రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) పరిధిలో మిల్లెట్స్ క్లస్టర్స్ ఏర్పాటు చేసి ప్రతి నెలా మొదటి శుక్రవారం వ్యవసాయ అధికారులతో రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ సాగును ప్రోత్సహిస్తున్నారు.

మద్దతు ధరలు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం మిల్లెట్స్ సాగు ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా జొన్న, రాగులకు మద్దతు ధరను కూడా ప్రకటించింది. హైబ్రీడ్ జొన్నలకు క్వింటా రూ. 3180 కాగా సాధారణ జొన్నకు క్వింటా 3225, అలాగే రాగులకు క్వింటాకు రూ. 3846గా ప్రకటించింది. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరను కల్పించి పౌరసరఫరాలశాఖ తరపున కొనుగోలు చేయనుంది.

లక్ష్యాన్ని సాధించేందుకు కృషి



రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడి వచ్చే పంటల సాగు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 8 వేలకు పైగా హెక్టార్లలో మిల్లెట్స్ సాగు లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తాం. - అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

సామాజిక స్పృహ అవసరం

కలెక్టర్ విజయరామరాజు



కడప సెవెన్‌రోడ్స్ : ప్రజల్లో సామాజిక స్పృహతోనే సమాజంలో మార్పు మొదలవుతుందని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో 'సోషియల్ బిహేవియర్ ఛేంజ్' కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యవంతంగా ఎదిగితేనే ఆ కుటుంబం అన్ని విధాలా శక్తివంతంగా మారుతుందన్నారు. ఆ దిశగా ఈ కమిటీకి సంబంధించిన అన్ని భాగస్వామ్య శాఖల అధికారులు బాధ్యతతో సమాజంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమాజంలో ఆడపిల్లలకు రక్షణ కల్పించడంతో పాటు, బాల్య వివాహాలను అరికట్టడం, ప్రతి ఆడపిల్ల బడికి వెళ్లి విద్యను అభ్యసించేలా చూడాలన్నారు. బాలికలు విద్యావంతులైతే వారి మానసిక పరిపక్వత పెరగడంతో పాటు కుటుంబం అంతా విద్యావంతులవుతారన్నారు. తద్వారా మహిళా సాధికారత కూడా సాధ్యం అవుతుందన్నారు. బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం అనే నినాదంతో కూడిన ప్రభుత్వ పథకం వంద శాతం విజయవంతం కావాలంటే జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖలు సమన్వయంతో ప్రధాన భూమిక పోషించాలన్నారు. ఎస్‌బీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ కేతుర, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీలక్ష్మి, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, వన్ స్టాప్ సెంటర్(సఖి), విద్య, పోలీసు శాఖలు, ఎన్జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో పని చేయాలి

జిల్లా మహిళా శిశు సంక్షేమ – సాధికారిత శాఖలో సీడీపీవోలు, సూపర్‌వైజర్లు బాధ్యతగా, సేవా దృక్పథంతో పని చేసినప్పుడే ఆరోగ్యకర సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ విజయ రామరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ – సాధికారిత శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందుతున్న ప్రతి లబ్ధిదారు కుటుంబం అంగన్వాడీ సేవలను పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రణాళిక ప్రకారం ప్రతి ప్రాజెక్టులను పర్యవేక్షించాలని పీడీని ఆదేశించారు. అనీమిక్, బరువు తక్కువ పిల్లలకు పోషకాహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, సీడీపీఓలు, అంగన్వాడీ సూపవైజర్లు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగుల గ్రీవెన్స్‌డే

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 21వ తేదీ సాయంత్రం 5.00 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు డీఆర్వో గంగాధర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

తండ్రిని పొడిచిన కుమారుడి అరెస్ట్

పోరుమామిళ్ల : పట్టణంలోని బలిజకోట వీధికి చెందిన నంద్యాల రామయ్య(65)ను ఈనెల 17న కత్తితో పొడిచిన ఆయన కుమారుడు లక్ష్మీనరసయ్య(35)ను బుధవారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి మార్కాపురం వద్ద అరెస్ట్ చేశారు. అతన్ని బద్వేలు కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని కర్మలవారిపల్లె గ్రామ పరిధిలో ఉన్న ఒక పాత గోడౌనులో అక్రమంగా నిల్వ ఉంచిన 110 బస్తాల (5510 కేజీల) బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇదురు బాషా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వరద కిషోర్‌రెడ్డి, మైలవరం డీటీ రూపేష మునిరావు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. నిల్వ ఉంచిన 110 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కె.చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకొని మైలవరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు డిప్యూటీ తహసీల్దార్ రూపేష్ మునిరావు తెలిపారు.

లంకమల అభయారణ్యంలో కూంబింగ్

సిద్దవటం : సిద్దవటం రేంజిలోని లంకమల అభయారణ్యంలో కూంబింగ్ నిర్వహించామని సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. సిద్దవటం, రోళ్ళబోడు బీట్లలోని సమస్యాత్మక ప్రదేశాలైన పాతాళబండ, సవర్లబావి, ఉలవకట్ట లోయ, ముట్టిక్కుడు, చెంచలచెలిమి, పెంటబావి, ఆముదా గొంది రస్తా వంటి ప్రదేశాల్లో రెండు రోజులుగా అటవీ శాఖ సిబ్బందితో కలిసి ఆమె కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు లంకమల అభయారణ్యంలో ముమ్మరంగా కూంబింగ్ నిర్వహించామన్నారు. ఎక్కడా ఏ విధమైన స్మగ్లింగ్ ఆనవాళ్లు కనిపించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, ఫారెస్టు బీటు అధికారులు రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, బంగ్లాబావి పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్


సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

నేర సమీక్షలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పోలీసు కార్యాలయ ఆవరణలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఎస్పీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తీవ్రమైన నేరాలలో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాల్లో వాహన దారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డెకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. పోక్సో, మహిళలపై జరిగిన నేరాలపై నిర్ణీత సమయంలో చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారణ జరిపి అదృశ్యమైన వారి ఆచూకీ త్వరగా తెలుసుకోవాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని పేర్కొన్నారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతోపాటు నిఘా పెంచాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. దేశీ అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణాపై దాడులను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎస్‌హెచ్‌ఆర్‌సీ, ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని వివరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ ప్రవీణ్ కుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ సిబ్బంది స్ఫూర్తిదాయక సేవలు

జిల్లాలో ఇటీవలి కాలంలో వివిధ కేసుల్లో అత్యుత్తమ సేవలందించిన కమాండ్ అండ్ కంట్రోల్ సిబ్బంది సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమాండ్ కంట్రోల్ సిబ్బంది స్ఫూర్తిదాయకమైన సేవలందించి జిల్లా పోలీసు శాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో జిల్లా ప్రత్యేక స్థానంలో నిలిచేలా కృషి చేశారని, రానున్న కాలంలో ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు, బద్వేలు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల పట్టణాలలో కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ద్వారా నేరాల నిరోధానికి పోలీసు సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా రక్షక్ వాహనాలు, బ్లూ కోల్ట్ మోటార్ సైకిళ్ల ద్వారా ఘటనా స్థలానికి క్షణాల్లో చేరుకొని నేరాలకు అడ్డుకట్ట వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

మహిళా పోలీసుల సేవలు ప్రశంసనీయం

జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న మహిళా సిబ్బంది సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. ఇటీవలి కాలంలో విధుల్లో అత్యుత్తమ పనితీరు కనబరచిన 30 మంది మహిళా పోలీసులను నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడంలో, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో మహిళా పోలీసులు విశేష కృషి చేస్తున్నారన్నారు. వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో విధులు నిర్వర్తించే మహిళా పోలీసులు స్కూల్ డ్రాప్ ఔట్స్ గుర్తించి తిరిగి స్కూళ్లలో చేర్పించేలా కృషి చేయడం, ఈవ్ టీజింగ్, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యక్రమాల గురించి క్షేత్ర స్థాయిలో ఆరా తీసి ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 'దిశ' డీఎస్పీ రమాకాంత్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

హత్య కేసు ఛేదనలో పోలీసుల కృషి అభినందనీయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : మైదుకూరు పరిధిలో జరిగిన హత్య కేసు ఛేదనలో పోలీసుల కృషి అభినందనీయమని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. కడప నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం హత్య కేసులోని నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన మైదుకూరు సీఐ బీవీ చలపతి, పోలీసులు కె.బ్రహ్మయ్య, ఎ.నాగరాజు, పి.వెంకటేశ్వర రెడ్డి, ఎం.గూగూడువల్లి, బి.రాజశేఖర్, బీవీ భాగ్యంరెడ్డిలకు ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల ముగ్గురు ముద్దాయిలకు కోర్టు యావజ్జీవ శిక్ష విధించిందన్నారు. కేసులో సాక్ష్యాధారాలతో నేర నిరూపణకు కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది కృషి ప్రశంసనీయమన్నారు. కేసు ట్రయల్ సమయంలో సాక్షుల విచారణ, కేసు రికార్డులు, కోర్టు వ్యవహారాలలో ప్రత్యేక శ్రద్ధ కనబరచారన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పెద్దముడియం : మండల పరిధిలోని దిగువ కల్వటాల గ్రామంలో అప్పుల బాధతో వీరబోయిన గంగా ప్రసాద్(34) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంగా ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కలరు. గంగా ప్రసాద్ తనకున్న 10 ఎకరాల పొలంలో గత కొన్ని సంవత్సరాలుగా పత్తి, మిరప పంటలను సాగు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సాగు చేసిన పంటల దిగుబడి సరిగా రాకపోవడంతో దాదాపు రూ.15 లక్షల మేర అప్పు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో.. చెల్లించే మార్గం కనిపించకపోవడంతో తన సొంత భూమిలోని వేప చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు.

ఆ ఉపాధ్యాయురాలే కావాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

ప్రొద్దుటూరు కల్చరల్ : తమ పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై బదిలీ చేసిన ఉపాధ్యాయురాలు సునందను తిరిగి ఇక్కడే కొనసాగించాలని ప్రొద్దుటూరులోని వైవీఎస్ పురపాలక బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు బుధవారం పాఠశాల ప్రధాన గేటు వద్ద నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ విద్యార్థిని తల్లి పాఠశాల వద్దకు వచ్చి ఉపాధ్యాయులతో గొడవ పడిన నేపథ్యంలో ఉపాధ్యాయురాలు సునందను డీఈఓ రాఘవరెడ్డి మరో పాఠశాలకు డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. విచారణ అనంతరం నిర్ణయం తీసుకుంటామని ఆయన అప్పట్లో వెల్లడించారు. రెండు రోజుల క్రితం విచారణ కమిటీ వచ్చి ఉపాధ్యాయులను, విద్యార్థులను, విద్యార్థిని తల్లిని విచారించి వెళ్లింది. ఈ నేపథ్యంలో తమకు ఎంతో నిబద్ధతతో విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయురాలిని తిరిగి ఇక్కడే నియమించి తమ విద్యాభ్యాసానికి అంతరాయం కలగకుండా చూడాలని విద్యార్థులు కోరారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో బుధవారం నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 57.1 ఓవర్లలో కర్నూలు జట్టు 175 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 53, మనోజ్‌రాజ్ 40 పరుగులు చేశారు. అనంత బౌలర్ ప్రదీప్‌రెడ్డి 6 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 32 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. జట్టులోని వీరారెడ్డి 36, కరీం బాబు 32 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్ భార్గవ్‌చంద్ర 2 వికెట్లు తీశాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.


మ్యాచ్ ఆడుతున్న అనంతపురం, కర్నూలు జట్లు


లక్ష్మీనారాయణ, (143 పరుగులు)


ప్రదీప్‌రెడ్డి, (6 వికెట్లు)

కేఓఆర్‌ఎం మైదానంలో..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 78.3 ఓవర్లలో 341 పరుగుల వద్ద చిత్తూరు జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ 143 బంతుల్లో 22 ఫోర్లు, 4 సిక్సర్లతో 143 పరుగులు చేశాడు. మహమ్మద్ ఇర్ఫాన్ 47 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ షాఫుల్‌హమీద్ 4, చిన్నబాబు 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 29 పరుగులు చేసింది. జట్టులోని షాఫుల్ హమీద్ 14 పరుగులతో క్రీజులో ఉన్నాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా జడ్జి అన్నపూర్ణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా న్యాయ సేవాధికారసంస్థ, కడప వారి ఆధ్వర్యంలో కడప శాశ్వత లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి.అన్నపూర్ణ తెలిపారు. బుధవారం సాయంత్రం జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ భవనంలో ప్రజా ప్రయోజిత న్యాయ సేవలపై న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ, రవాణా, పోస్టల్, టెలిఫోన్ సేవలు, విద్యుత్ సరఫరా, కాంతి, నీటి, ప్రజా సంరక్షణ, పారిశుధ్యం, ఆస్పత్రి, డిస్పెన్సరీ, బీమా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సంస్థలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్య, విద్యా సంస్థలు, హౌసింగ్, రియల్ ఎస్టేట్ సేవలపై వివరించారు. అలాగే శాశ్వత లోక్ అదాలత్ కక్షిదారుల మధ్య వివాదంలో ఉన్న విషయాన్ని సామరస్యంగా పరిష్కరించడం లేక అర్హతల ఆధారంగా పరిష్కరించబడుతుందన్నారు. పార్టీలు సెటిల్‌మెంట్లు రాకుంటే మెరిట్ ఆధారంగా అవార్డులను ఆమోదించేందుకు శాశ్వత లోక్ అదాలత్‌కు న్యాయ నిర్ణేత అధికారం ఉంటుందన్నారు. ఈ లోక్ అదాలత్‌లు సంబంధిత జిల్లా ప్రధాన కార్యాలయంలో న్యాయ సేవా సదన్ భవన సముదాయాలలో పని చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కడప శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలు చైర్మన్ స్వర్ణ ప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని తారక రామనగర్‌కు చెందిన పూసల జయంతి (27) అదృశ్యమైనట్లు వన్‌టౌన్ ఎస్ఐ సిద్దయ్య తెలిపారు. గత నెల 23వ తేది నుంచి జయంతి కనబడకపోవడంతో తల్లి గాలింపు చర్యలు చేపట్టిందన్నారు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో తల్లి సుభద్ర బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

మహిళ అరెస్టు : గంజాయి కేసులో ఓగూరు తులసి అనే మహిళను అరెస్టు చేశామని తాలూకా పోలీసులు తెలిపారు. ఈమె గంజాయి కేసుకు సంబంధించి గత ఏప్రిల్ నుంచి పరారీలో ఉందన్నారు. ఈ క్రమంలో నిందితురాలు భగత్‌సింగ్ నగర్‌లో ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి అరెస్టు చేశామని తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని పొడదుప్పి మృతి

అట్లూరు : కడప – బద్వేలు ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని పొడదుప్పి మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు.. బద్వేలు మండలం వెంకటశెట్టిపల్లె గ్రామ సమీపాన బుధవారం సాయంత్రం రోడ్డు దాటుతున్న పొడదుప్పిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం అటవీ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు.

డీసీసీ బ్యాంకులో డిపాజిట్లకు అధిక వడ్డీ


బోర్డు సమావేశంలో పాల్గొన్న ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్, డైరెక్టర్లు

కడప అగ్రికల్చర్ : ప్రాథమిక వ్యవసాయ సంఘాలు డీసీసీ బ్యాంకులో జమ చేయు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఒక శాతం అధిక వడ్డీ ఇవ్వనున్నట్లు ఆప్కాబ్, డీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. బుధవారం కడపలోని డీసీసీ బ్యాంకులో బ్యాంకు బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపాజిట్‌పై ఇచ్చే లోన్లకు 1 శాతం తక్కువ వడ్డీ తీసుకునుటకు నిర్ణయించినట్లు తెలిపారు. సొసైటీ సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా కోసం కడప డీసీసీ బ్యాంకు ఖర్చుతో ఈ సంవత్సరం పాలసీ తీసుకోవడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. అందుకు సుమారు రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేయడం జరిగిందన్నారు. అనంతరం నిర్వహించిన డీఎల్‌ఈసీ సమావేశంలో హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం కడప, అన్నమయ్య జిల్లాల్లోని డీసీసీ బ్యాంకుకు అనుసంధానంగా ఉన్న సొసైటీ సిబ్బందికి కొత్త జీతాలు జూలై 2023 నుంచి అమలు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్లు వెంకటసుబ్బారెడ్డి, అంజనేయులు, రాజామణి, షేక్ హుస్సేన్‌పీరా, గంగాద్రి, వీరారెడ్డి, సురేష్, డీసీఓ సుభాషిణి, నాబార్డు డీడీఎం విజయవిహారి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలు దీక్షల్లో పాల్గొనవద్దు


మాట్లాడుతున్న వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషయ్య

కమలాపురం : జిల్లాలోని అన్ని మండలాల రెవెన్యూ కార్యాలయాల్లో పని చేస్తున్న వీఆర్‌ఏలందరూ ఈ నెల 20, 21వ తేదీల్లో జరిగే దీక్షల్లో పాల్గొనవద్దని వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శేషయ్య తెలిపారు. బుధవారం ఆయన కమలాపురంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామ రెవెన్యూ సహాయకుల కొన్ని సంఘాలు ఈ నెల 20, 21వ తేదీల్లో మండల కేంద్రాల్లో దీక్షలు నిర్వహించాలని పిలుపునిచ్చాయన్నారు. అయితే ఏపీ రెవెన్యూ చైర్మన్ ఏఎస్ దివాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు ఓ.ధైర్యం ఆదేశాల మేరకు దీక్షలు చేపట్టరాదని నిర్ణయించారన్నారు. ఆ మేరకు ప్రతి మండలంలో గ్రామ రెవెన్యూ సహాయకులు దీక్షల్లో పాల్గొనవద్దని ఆయన పేర్కొన్నారు. మన నూతన సంఘం ఏర్పడిన తక్షణం వీఆర్‌ఏకు ముఖ ఆధారిత హాజరు మినహాయించడం జరిగిందని గుర్తు చేశారు. అలాగే ప్రమోషన్లు, డీఏలకు సంబంధించిన ఫైళ్లు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. గత నెల 27వ తేదీన అన్ని సంఘాల రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులతో సీసీఎల్‌ఏ కమిషనర్ వీఆర్‌ఏల సమస్యలపై చర్చించారని అన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని 20, 21వ తేదీల్లో జరిగే దీక్షల్లో వీఆర్‌ఏలు ఎవరూ పాల్గొనవద్దని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నాగేష్, ఇబ్రహీం, అబ్బాస్ పాల్గొన్నారు.

సిగరెట్ల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


సీజ్ చేసిన సిగరెట్ ప్యాకెట్లతో విజిలెన్స్ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో నకిలీ, అనధికారిక విదేశీ బ్రాండ్ సిగరెట్లు అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి షేక్ మాసుంబాష ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. కడప నగరంలోని బెల్లంమండివీధిలో మిద్దె కృష్ణయ్య కిరాణాషాపులో దాదాపు రూ.2.21 లక్షల విలువైన 650 సిగరెట్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. మునిరావువీధిలో ఉండే షేక్ ఖాదర్‌బాష వద్ద రూ, 1,16,620 విలువైన 343 సిగరెట్ ప్యాకెట్లను సీజ్ చేశారు. పాత మార్కెట్‌లో గఫ్ఫార్ జనరల్ స్టోర్‌లో రూ. 3,91,000 విలువైన 1150 సిగరెట్ ప్యాకెట్లను సీజ్ చేశారు. అలాగే పాత కూరగాయల మార్కెట్ సమీపంలో మోడ్రన్ జనరల్ స్టోర్‌లో రూ.2,33,580 విలువగల 687 సిగరెట్ ప్యాకెట్లను సీజ్ చేశారు. అలాగే పాత మార్కెట్‌లో నాగరాజు జనరల్ స్టోర్‌లో దాదాపు రూ.11,51,520 విలువైన 3,387 సిగరెట్ ప్యాకెట్లను సీజ్ చేశారు. మొత్తం రూ. 21,47,780 విలువైన 6317 సిగరెట్ ప్యాకెట్లను సీజ్ చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు రెడ్డెప్ప, రామకృష్ణ, ఇతర అధికారులు శ్రీనివాసులు, ఏఓ బాలగంగాధర్‌రెడ్డి, ఏఈలు విజయ కిశోర్, అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు.

నేడు ప్రొద్దుటూరులో ప్రగతి పనుల ప్రారంభం

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత రాక

ప్రొద్దుటూరు : రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత తొలి మారు జిల్లా పర్యటనలో భాగంగా ప్రొద్దుటూరు పట్టణానికి గురువారం వస్తున్నారు. ఇందులో భాగంగా సుమారు రూ.150 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను హోం మంత్రి ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి బుధవారం ఈ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ప్రజలకు శుద్ధి నీరు అందించేందుకు గాను రూ.120 కోట్లతో పూర్తి చేసిన అమృత్ తాగునీటి పథకాన్ని ప్రారంభించనున్నారు. మైలవరం డ్యాం నుంచి ఇందుకోసం ప్రత్యేక పైపు లైన్ ఏర్పాటు చేసి స్థానిక రెండు కొళాయిల వద్ద నీటిని శుభ్రం చేసి ప్రజలకు అందించనున్నారు. మొత్తం నీటి పథకం అంచనా వ్యయం రూ.151.38 కోట్లు కాగా ఇందులో మున్సిపాలిటీ వాటా రూ.97.20 కోట్లు ఉంది. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద రూ.1.5 కోట్లతో నిర్మించిన వైఎస్సార్‌అర్బన్ హెల్త్ క్లినిక్‌కు ప్రారంభోత్సవం చేస్తారు. రూ.4.60 కోట్లతో 2.53 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన మున్సిపల్ గాంధీ పార్కును ప్రారంభించనున్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులో అత్యాధునిక రీతిలో రూ.కోటి 83 లక్షలతో నిర్మించనున్న స్మార్ట్ స్ట్రీట్ పనులకు మంత్రి భూమి పూజ చేయనున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

రాజన్న భోజనం ప్రారంభం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సొంత డబ్బుతో రోజూ వేలాది మందికి ఉచితంగా అన్నం పెట్టేందుకు రాచమల్లు రాజన్న భోజనం క్యాంటిన్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక వివేకానంద క్లాత్ మార్కెట్ ఎదురుగా నిర్మించిన ఈ క్యాంటిన్‌ను మంత్రి ప్రారంభించనున్నారు.

10 వేల మందితో బహిరంగ సభ

ప్రారంభోత్సవ కార్యక్రమాల అనంతరం వివేకానంద క్లాత్ మార్కెట్ వద్ద 10 వేల మందితో బహిరంగ సభను నిర్వహించేందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబుతోపాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారు.

బీసీల అభ్యున్నతికి సీఎం విశేష కృషి


రమేష్‌యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బీసీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ పేర్కొన్నారు. ఆయనను బీసీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా మాట్లాడుతూ తనకు లభించిన ఈ పదవి ద్వారా బీసీల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి ఇవ్వడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా రమేష్ యాదవ్‌కు పదవి రావడం పట్ల ఆయన అభిమానులు బుధవారం ప్రొద్దుటూరులో వేడుకలు జరుపుకొన్నారు.